క్లుప్తంగా

యూరియా.. తిప్పలు



మహమ్మదాబాద్: యూరియా కోసం రైతులకు అవస్థలు తప్పడంలేదు. ఉదయం నుంచి ఎరువుల దుకాణాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. చివరకు మధ్యాహ్నం తర్వాత ఒక్క లోడు యూరియా రావడంతో రెండు దుకాణాల వద్ద వందలాది మంది ఎగబడ్డారు. దీంతో జయమానులు ఎవరికి ఇవ్వాలో ఎవరికి ఇవ్వకూడదో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. వచ్చిన యూరియా బ్యాగులు టోకెన్ల ప్రకారం లారీపై నుంచే లాక్కోవడంతో మిగతా రైతులు బిక్కుబిక్కుమంటూ గంటల తరబడి పడిగాపులుగాసి వెళ్లిపోయారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



జడ్చర్ల టౌన్: జీఎస్టీ 2.0 సంస్కరణ చేసినందుకు గురువారం మున్సిపాలిటీలోని నేతాజీ చౌరస్తాలో బీజేపీ, భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థికశాఖ మంత్రి సీతారామన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సంస్కరణ వల్ల సాధారణ మనిషి జీవితాన్ని బలపరుస్తుందని బీకేఎస్, బీజేపీ నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌గౌడ్, నాయకులు బాలవర్ధన్‌గౌడ్, కృష్ణయ్య, నర్సింహులు, సాహితిరెడ్డి, సీతారాం జవహర్, శ్రీకాంత్, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

జడ్చర్లలో నేడే నిమజ్జనం

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మండలంలోని గ్రామాలతో పాటు మున్సిపాలిటీ ప రిధిలోని గణనాథులను నిమజ్జనం చేయనున్నారు. ఇందుకోసం మున్సిపాలిటీ పరిధిలోని నాగసాల చెరువు వద్ద మున్సిపాలిటీ అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండు క్రేన్లను అందుబాటులో ఉంచినట్లు కమిషనర్ లక్ష్మారెడ్డి తెలియజేశారు. గణేశ్ నిమజ్జన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నేతాజీ చౌరస్తాలో స్వాగత మంటపం ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు అఖిల్ రెడ్డి తెలిపారు.

ఉపాధ్యాయులైన వేళ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్):ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్యస్కూల్ (బీఎస్ఎన్ఎల్ బ్రాంచ్)లో స్వయం పారిపాలన దినోత్సవం నిర్వహించారు. తోటి విద్యార్థులకు బోధించి మెప్పించారు. విద్యార్థులు గురువలపై తమ కృతజ్ఞతలను వ్యక్తం చేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయ పాత్ర పోషించిర విద్యార్థులకు బహుమతులతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం భాస్కరెడ్డి, కోఆర్డినేటర్ రఘుబాబు, డీన్ మహేశ్, ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.

మద్దిగట్లలో విషాదం

భూత్పూర్: నాగర్‌కర్నూల్ జిల్లా పటవర్లపల్లి వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మద్దిగట్లకు చెందిన మహేశ్(18) అక్కడికక్కడే మృతిచెందగా, యశ్వంత్‌కు తీవ్ర గాయాలు కాగా శివతోపాటు మరో ఏడుగురికి స్వల్ప గాయాలు కావడంతో గ్రామంలో విషా దం అలుముకుంది. ప్రమాద విషయం తెలు సుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మహేశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యాసామగ్రి పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: మహ్మద్ ప్రవక్త (స.అస)1500వ జన్మదినోత్సవం సందర్భంగా ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ తరపున కులమతాలకతీతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కష్టపడి చదివి ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్యదర్శి యాఖుబ్, షేక్ మహమూద్, మహెబూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

చేయూతనందించాలి

అడ్డాకుల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు చేయూతనందించాలని హైస్కూల్ జీహెచ్‌ఎం ఫయాజుద్దీన్ అన్నారు. మండలంలోని నిజాలాపూర్‌లో ఏర్పాటైన 'ధ్యాన-ధర్మ' ఆశ్రమం ఫౌండర్ రాము మాస్టర్, అర్చన ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో విద్యార్థులకు వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపు నిర్వహించి ఉచితంగా కంప్యూటర్ శిక్షణను అందించారు. అందులో ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత డీఎస్ మధుసూదన్ సహకారంతో గురువారం బహుమతులను అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన అమూల్యకు కంప్యూటర్ డెస్క్‌టాప్, ద్వితీయ స్థానంలో నిలిచిన నందినికి రూ.5వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ శిక్షకులు కమలాకర్, లోహిత్, భీంరావ్, డీఎస్ ఆనంద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

యువతకు సాంకేతిక నైపుణ్యతతో శిక్షణ

- రాష్ట్ర యువజన సర్వీసులశాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- జడ్చర్లలో సెట్విన్ శిక్షణ కేంద్రం, అగ్నిమాపక శాఖ భవనం ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి



జడ్చర్లలో అగ్నిమాక కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల: మారుతున్న కాలంతో పోటీ పడేవిధంగా నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధికి సాంకేతిక నైపుణ్యంతో కలిగిన శిక్షణ అవసరమని, ఆదిశగా తమ ప్రభుత్వం ముందుకెళ్తుందని యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. గురువారం జడ్చర్లలో హెటిరో ఫార్మా సహకారంతో రూ.47లక్షల నిధులతో నిర్మించిన అగ్నిమాపక శాఖ కార్యాలయం భవనం, సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. జడ్చర్లలో అగ్నిమాపక శాఖ కేంద్రానికి ఇంతకాలం భవనం లేకపోవడం దురదృష్టకరమన్నారు. మండలస్థాయిలో ఫైర్‌స్టేషన్‌లను విస్తరించేందుకు అధికారులు ప్రతిపాదనలు నివేదించాలన్నారు. జడ్చర్లలో ప్రారంభించుకున్న సెట్విన్ శిక్షణ కేంద్రంలో యువతీ, యువకులు వృత్తికి సంబంధించిన కోర్సుల్లో శిక్షణ పొంది రాణించాలన్నారు. ఇటీవల జడ్చర్ల నియోజకవర్గానికి ఏటీసీ శిక్షణ కేంద్రం మంజూరైందని తెలిపారు. జడ్చర్ల ప్రాంత అభివృద్ధికి పాటుపడతానని, అత్యధికంగా నిధులు ఇచ్చేందుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అలాగే పాలమూరు సమగ్రాభివృద్ధికి పాటుపడుతామని పేర్కొన్నారు.

చేపలు పట్టే కులానికే చేపల శాఖ

దేశంలోనే తొలిసారిగా చేపలు పట్టే కులానికి చెందిన వ్యక్తికి చేపల శాఖ దక్కడం గర్వకారణమని మంత్రి శ్రీహరి పేర్కొన్నారు. బడ్జెట్‌లో కేవలం రూ.19కోట్లు మాత్రమే కేటాంచినా.. తాము అడిగిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి రూ.123కోట్లు కేటాయించడం గొప్ప విశయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 42వేల చెరువుల్లో 82కోట్ల చేప పిల్లలను వదలనున్నట్లు తెలిపారు. నాణ్యత కలిగిన మూడు రకాల చేపలను వదలి చెరువు కట్టలపై పూర్తివివరాలతో బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

సొంత నిధులతో భవనం ముస్తాబు

సెట్విన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న భవనానికి తాను సొంతంగా రూ.20లక్షలు వెచ్చించి మౌలిక సదుపాయాల కల్పనతో ముస్తాబు చేయించానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. అంతేకాకుండా 250మంది శిక్షణకు సంబంధించి అభ్యర్థులు చెల్లించాల్సిన ఫీజు ను తానే ప్రతిబ్యాచ్‌కు రూ.4.50 లక్షల చొప్పున సెట్విన్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన వారికి పోలేపల్లి సెజ్ పరిశ్రమలతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉద్యోగ, ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయన్నారు. సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. మక్తల్, దుబ్బాకలో తమ సెట్విన్ శిక్షణ కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, ఆర్డీఓ నవీన్, తహసీల్దార్ నర్సింగరావు, కమిషనర్ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

జడ్చర్ల సమగ్రాభివృద్ధికి మరింత కృషి

జడ్చర్ల: నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో చేపల మార్కెట్ భవనానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పాతబజార్‌లోని గాంధీచౌరస్తా వద్ద హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జడ్చర్లలో చేపల మార్కెట్ లేకపోవడంతో విక్రయదారులు రోడ్లను అనుసరించి ఎక్కడపడితే అక్కడ విక్రయించి ఇబ్బందులు పడుతున్నారని, వారికి ప్రత్యేకంగా భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు అందులో భాగంగానే రైల్వేస్టేషన్ సమీపంలో హైమాస్ట్ సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు శ్రావణి, ఉమాదేవి, చౌహాన్, రమేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రధాన లక్ష్యం

రాజాపూర్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అగ్రహారం పోట్లపల్లిలో సీసీరోడ్లు, కల్లేపల్లిలో సీసీరోడ్లతోపాటు జీపీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపిస్తే కల్లేపల్లికి మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాధాకృష్ణ, ఎంపీడీఓ విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ బాలమణి, శ్రీశైలం, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలను గుర్తించి పథకాలిచ్చేది కాంగ్రెస్సే..

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- చిన్నాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం



చిన్నాయపల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: పేదలను గుర్తించి అన్ని పథకాలు అందించేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఇందిరమ్మ ఆదర్శ గ్రామమైన చిన్నాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తున్నామని తెలిపారు. గతంలో ఎంతో మందికి ఇళ్లను ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు కూడా ఇళ్లను ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో గ్రామాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించేలా కార్యకర్తలు కృషిచేయాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ గృహం ప్రారంభించి పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నారాయణ, డీసీసీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతీభాయి, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, జునేద్, భరత్ ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పురుషులతో సమానంగా కూలీ ఇవ్వాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అడ్డామీద పనిచేసే కూలీలకు దినసరి కూలీ రూ. వెయ్యి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట లేబర్ అడ్డా వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. పురుషులతో సమానంగా మహిళా కూలీలకు కూలీ ఇవ్వడంలేదని, ఈ తారతమ్యం లేకుండా కూలీ రేట్లు సమానంగా ఇవ్వాలన్నారు. మహిళా కూలీలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో అడ్డా కూలీకి వస్తున్నారన్నారు. అడ్డాకూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు హన్మంతు, భగవంతు, శివలీల, బాబు, ఆంజనేయులు, రవి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

'మార్వాడీల మోసాలను అడ్డుకోవాలి'

మహబూబ్‌నగర్ రూరల్: వ్యాపారులందరూ కలిసికట్టుగా మార్వాడీల మోసాలను అడ్డుకోవాలని తెలంగాణ బచావో మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు. స్థానిక బుద్ధా భవన్‌లో గుజరాత్, రాజస్తాన్, బీహార్ మర్వాడీ గో బ్యాక్ తెలంగాణ బచ్చావో మూమెంట్ ఆధ్వర్యంలో బొర్ర సురేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడమర్తి రవి పా ల్గొని మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో జీఎస్టీ కట్టకుండా నకిలీ వస్తువులు వ్యాపా రం చేసే రాజస్థాన్, గుజరాత్, బీహార్ మార్వాడీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల ని డి మాండ్ చేశారు. ప్రజాసంఘాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణలో మర్వాడీ దౌర్జన్యాలపైన తెలంగాణ ప్రజలు పోరా టం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు రవి, రహీం, సురేశ్, మహేశ్ పాల్గొన్నారు.

కార్మికులను వేధిస్తున్న వారిని సస్పెండ్ చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సూపర్‌వైజర్లను వేధిస్తున్న సీహెచ్‌ఓ, ఎస్‌హెచ్‌ఓలను సస్పెండ్ చేయాలని తెలంగాణ మెడికల్ వర్కర్స్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. గురువారం తమ బాధలు చెప్పుకునేందుకు ఆస్పత్రి అధికారుల వద్దకు వెళ్లిన కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీహెచ్‌ఓ, ఎస్‌హెచ్‌ఓల తీరును నిరసిస్తూ విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. డిప్యూటీ సూపరింటెండెంట్ హామీ మేరకు కార్మికులు విధుల్లో చేరుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ యూనియన్ నాయకులు చెన్నయ్య, మొగులయ్య, రంగన్న, నర్సింహ, బాలకోటి, యాదయ్య, మన్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనతో జీవితంలో మార్పు



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రతిరోజూ దేవుడిని ప్రార్థిస్తే జీవితంలో ఒక మార్పు వస్తుందని అంతర్జాతీయ ముఖ్య ప్రసంగీకురాలు థెరిస్సాపాల్ అన్నారు. రెమా వర్షిప్ సెంటర్ ఆధ్వర్యంలో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని జేజేఆర్ ఫంక్షన్‌హాల్లో ఉపవాస ప్రార్థన పండుగలు రెండోరోజు గురువారం ఘనంగా సాగాయి. ఈ సందర్భంగా ఆమె ఇంగ్లీష్‌లో ప్రసంగించగా.. పాస్టర్ పరంజ్యోతి తెలుగులో అనువదించారు. ప్రతిరోజూ ఏకాగ్రతతో దేవుడితో ప్రార్థనపరంగా మాట్లాడగలితే మనం ఎప్పుడూ చూడని మార్పును చూస్తామన్నారు. దేవునితో మాట్లాడాలంటే ప్రార్థన రూపంలోనే సాధ్యమన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని గుర్తుచేశారు. పాస్టర్ పరంజ్యోతి మూడురోజులపాటు ఉపవాస ప్రార్థనలు ఏర్పాటు చేయడం సంతోషకరమని అభినందించారు. అలాగే దేశ క్షేమం కోసం జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన దైవ సేవకులంతా ప్రార్థించారు. అనంతరం రోగులకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు కేవీ పాల్, జోయల్‌బాబు, యేసుపాదం, సుందర్‌పాల్, వేదాంతిబాబు, తిమోతి, నాగరాజు, ఐజక్, మార్టిన్, హానోక్, సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

బైబై గణేశా



దేవరకద్రలోని తీగలపల్లికట్ట భారీ వినాయక ప్రతిమను నిమజ్జనానికి తరలిస్తున్న నిర్వాహకులు

దేవరకద్ర: మున్సిపాలిటీలో గురువారం గణేశ్ నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా సాగింది. తొమ్మిది రోజులుగా పూజలందుకున్న గణనాథుడు గురువారం మధ్యాహ్నం నుంచి ఊరేగింపుగా నిమజ్జనానికి బయలు దేరాడు. డీజే పాటలు, భాజాభజంత్రీలతో దద్దరిల్లి పోయింది. యువకుల నృత్యాలు, మహిళల బొడ్డెమ్మలు, బాలికల కోలాటాలతో పట్టణమంతా సందడిగా మారింది. నిమజ్జనోత్సవం రాత్రి వరకు కొనసాగడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవరకద్ర పెద్ద చెరువులో క్రేన్ల సహాయంతో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

రూ.లక్షా 11వేలకు లడ్డూవేలం

దేవరకద్ర తీగలపల్లికట్ట గణేశ్ లడ్డూ వేలం అధిక ధర సమోదైంది. దేవరకద్రకు చెందిన సత్యనారాయణ రూ.లక్షా11వేలకు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. కుర్వగేరి లడ్డూను శివ అనే యువకుడు రూ.68వేలకు దక్కించుకున్నారు. నవాబుపేట మండల కేంద్రంలో నీలకంఠ ఆలయంలో ఏర్పాటు చేసిన గణపతి, డాక్టర్ శ్రీనివాస్‌గల్లి, మూడో వార్డులో ప్రతిష్ఠించి న గణనాథులను గురువారం నిమజ్జనానికి రతలించారు.

మండపాల్లో ప్రత్యేక పూజలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాతపాలమూరు, శివశక్తినగర్, బ్రహ్మణవాడి, బండ్లగేరి, పుట్నాలబట్టి, పాతతోట, టీడీగుట్ట, కొత్తగంజ్, హనుమాన్‌నగర్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, శేషాద్రినగర్, నాగిరెడ్డికాలనీ మండపాల్లో ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు.



నిమజ్జనానికి తరలుతున్న దేవరకద్ర రైల్వేస్టేషన్ గణేశుడు



బ్రాహ్మణవాడిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



నవాబుపేటలో నిమజ్జనానికి తరలుతున్న నీలకంఠ గణపతి



దేవరకద్రలో నిమజ్జనానికి తరలుతున్న శివాజీనగర్ గణేశుడు



కోయిల్‌సాగర్‌లోని కృష్ణమ్మ ఒడికి తరలుతున్న రాయిచూర్‌రోడ్ వినాయకుడు



నాగిరెడ్డికాలనీలో పూజాకార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్‌కుమార్‌గౌడ్

పుస్తక పఠనంతో విజ్ఞానం

మహబూబ్‌నగర్ రూరల్: పుస్తక పఠనంతో విద్యార్థులకు జ్ఞాపకశక్తితోపాటు ప్రపంచంలోని జ్ఞానాన్ని తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ధర్మాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. అనంతరం రూ.20వేలు విరాళం సేకరించి గ్రంథాలయానికి పుస్తకాలు ఏర్పాటు చేసిన తెలుగు ఉపాధ్యాయుడు, కవి, కీర్తి పురస్కార గ్రహీత వెంకటేశ్వరశర్మ, 150కి పైగా పుస్తకాలను బహూకరించిన కవి బోల యాదయ్యను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కళాభవన్ పరిరక్షణ జేఏసీ కమిటీ ఏకగ్రీవం

మహబూబ్‌నగర్ రూరల్: అంబేద్కర్ కళాభవన్ పరిరక్షణ జేఏసీ కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం భగీరథ కాలనీలోని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ కార్యాలయంలో దళిత సంఘాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిరక్షణ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా సింగిరెడ్డి పరమేశ్వర్, కో చైర్మన్లుగా రాయికంటి రాందాస్, మల్లెపోగు శ్రీనివాస్, కన్వీనర్‌గా రమేశ్‌తోపాటు ఇతర కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం అంబేద్కర్ కళాభవన్ ఆవరణలో ఏ ఇతర నిర్మాణాలు చేపట్టొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామంటూ తీర్మానం చేసినట్లు వెల్లడించారు.

బడులను కాపాడుకుందాం

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలలను కాపా డుకోవాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రిపై ఉందని అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీశ్‌బైరెడ్డి పిలుపు నిచ్చారు. మున్సిపాలిటీలోని నాగసాల ప్రాథ మిక పాఠశాలలో నిర్వహించిన విద్యాసద స్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగన్, హెచ్‌ఎం సావిత్రి, వార్డుకౌన్సిలర్ నవనీత, ఐద్వా మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

పుర కార్మికులకు దుస్తుల పంపిణీ



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని గురువారం మున్సిపల్ కార్మికులకు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి చేతులమీదుగా దుస్తులను అందజేశారు. కార్మికులతో కలసి విందుభోజనం చేశారు. సత్యేశ్వర ఆశ్రమంలోనూ అన్నదానం చేయించారు.

అట్టహాసంగా స్కూల్ గేమ్స్



మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్‌జీఎఫ్ క్రీడలు అట్టహాసంగా సాగాయి. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల, సేయింట్ మేరీస్ ఉన్నత పాఠశాల, చైతన్యభారతి ఉన్నత పాఠశాల, కేజీబీవీ, వస్పుల, బోయిన్‌పల్లి, అయ్యవారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. అండర్-17, అండర్-16, కబ్బడ్డీ, వాలీబాల్, ఖోఖో నిర్వహించారు. క్రీడలను జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, ఎంపీడీఓ గీతాంజలి, ఎంఈఓ వెంకటయ్య ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ చైర్మన్ శారద, జీహెచ్‌ఎంలు, గ్రామపెద్దలు, పీడీ పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలంలోని ఉడిత్యాలలో గురువారం నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది రోజులు భక్తులతో పూజలు అందుకున్న గణనాథుడికి భక్తులు కోలాటాలు, భజనలు చేస్తూ గ్రామంలో ఊరేగించిన అనంతరం శివారులోని తిమ్మరాయ చెరువులో నిమజ్జనం చేశారు. మాజీ ఎంపీటీసీ ప్రదీప్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, జగన్‌పటేల్, లింగం గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

క్రీడలపై నైపుణ్యం కలిగి ఉండాలి



మహమ్మదాబాద్: క్రీడలతో విద్యార్థులకు మేలని, క్రీడలపై మంచి నైపుణ్యం కలిగి ఉండాలని ఎంఈఓ రాజునాయక్ తెలిపారు. గురువారం మండలంలోని పల్లవి పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి కోకో పోటీల ప్రారంభానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీల్లో మొత్తం అండర్-14లో 14జట్లు, అండర్-17లో 10జట్లు, అండర్- 17లో నంచర్ల బాలుర మొదటి స్థానం, రెండోస్థానంలో మహ్మదాబాద్ బాలుర, బాలికల విభాగంలో నంచర్ల గురుకుల మొదటిస్థానం, రెండో స్థానంలో మహమ్మదాబాద్, అండర్-14లో జెడ్పీహెచ్‌ఎస్ నంచర్ల, రెండోస్థానంలో మహమ్మదాబాద్ బాలుర, బాలికల విభాగంలో మొదటిస్థానంలో మహమ్మదాబాద్ కేజీబీవీ, రెండోస్థానంలో నంచర్ల బాలికల ఉన్నత పాఠశాల నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్లవి విద్యాసంస్థల చైర్మన్ రుద్రారెడ్డి, ఎంఎల్‌ఓ సురేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవిలత, ఎస్‌జీఎఫ్ పీడీ శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

దుండగులపై చర్యలు తీసుకోవాలి

రాజాపూర్(బాలానగర్): బాలానగర్ మండలంలోని కేతిరెడ్డిపల్లిలో అంబేద్కర్ విగ్రహం చేతివేళ్లను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ లెనిన్‌గౌడ్‌కు అంబేద్కర్ మండల కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల కిందట గాలిగూడకు చెందిన బొట్టురాజు అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేస్తానని ఫోన్‌లో వాయిస్ మెసేజ్ పెట్టాడని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శేఖర్, లక్ష్మయ్య పేర్కొన్నారు.

యూత్ కాంగ్రెస్‌కు ప్రాధాన్యమివ్వాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు 20శాతం సీట్లు కేటాయించి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్ కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో అవేజ్ ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు సీట్లు కేటాయించి సముచితస్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు సల్మాన్, ఉపాధ్యక్షులు ముస్తాక్‌అలీ, సూఫియాన్ అహ్మద్, పట్టణ అధ్యక్షుడు రహీం, నాయకులు హకీం, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

గురువులకు ప్రత్యేక గౌరవం

అడ్డాకుల: భావితరాల భవిష్యత్‌ను తీర్చిదిద్దే గురువులకు సమాజంలో ప్రత్యేక గౌరవం , గుర్తింపు ఉందని మూసాపేట ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 18మంది ఉపాధ్యాయులు ఫయాజోద్దిన్, గోవర్ధన్‌రెడ్డి, పవన్‌కుమార్, సుధీర్, వనిత, గీతాదేవి, శివశరణప్ప, శివరాజ్, నిరంజన్‌రావు, బాలకిష్టయ్య, పుష్పలత, సురేష్, నీరజ, నర్సింహారెడ్డి, రాజు, రఘు, ఆంజనేయులు, అరుణను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. గురువారం ఎంఆర్‌సీ వద్ద ఎంఈఓ ఆధ్వర్యంలో వారికి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

